
14/5/91



# అనంతరం!

## భమిడిపాటి కృష్ణమూర్తి

వెన్నెల పిండారబోసినట్లు ప్రసరించి భావాలకు ఉద్రేకిస్తోంది. చల్లని పిల్లగాలులు హాయిగా అనుభవించేవారి కోసమేనన్నట్లు మెల్లగా వీస్తున్నాయి. దూరాన సెలయేటి సవ్వడి నిండుచూలాలి నడకలోని కాలియందెల సవ్వడిలా వినవస్తోంది. ప్రతి వస్తువూ మరో వస్తువుతో ఆకర్షింపబడుతోంది. భిన్న ధృవాల ఆకర్షణలా గతాన్ని పెనవేసుకుని, భావికి చివళ్ళు సాచి, వర్తమానానికి వత్తాసునిస్తున్నాయి. ప్రతి కదలిక అడుగునా మెదిలే ఆలోచనలు. నరాల సత్తువ, కరాల బిగువు మనోజవాన్ని నిలదీయలేక కళ్ళు తేలవేస్తున్నాయి. ప్రకృతి వసంతంతో పంతం పడుతోంది.

ఇది ఆది.

గాలి కిటికీలగుండా స్వరున దూసుకువస్తోంది. గదిలో ఒక్కడినే ఉన్నానన్న భయం నన్ను కలచివేస్తోంది. చుట్టూ వున్న మందుల బీరువాలు నన్ను పిలిచి పలుకరిస్తున్నాయి. రైలుపోతూ వుంటే చెట్లు చేమలు వెనక్కిపోతూ ఉంటాయి. మళ్లీ కనబడవు. కాని ఆ అనుభూతి.

చెదిరిన కంగరీగల తుట్టెలాగ.. ఆలోచనలు చెలరేగుతున్నాయి. కన్నుల మూసుకుని పడక కుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాను. ఎందుకోనాలో ఆధ్యాత్మిక చింతన బైలుదేరింది. జీవితంలో తారసిల్లేది సంకలనం, వ్యవకలనం మాత్రమేనేమో అందుకే సుఖ దుఃఖాలు రెండే వున్నాయి. ఒంటరితనం నా మీద తుంటరి తనం నెరపుతోంది. గాలి శరీరాన్ని కోసేస్తోంది. వెంటనే లేచి వెళ్లి కిటికీ తలుపులు మూసివచ్చాను.

పూర్తిగా రాత్రి కావడానికింకా రెండుగంటల వ్యవధివుంది.. ఆ తరువాతగాని నిద్రాదేవతకు కరుణ కలగదు. అయినా నా పిచ్చిగాని ఈ ఏకాంతాల్లోకి నిద్రాదేవైనా ఒంటరిగా వస్తుందన్న ఆశలేదు. సిగరెట్టు వెలిగించాను. ఆలోచనలను మళ్లించాలనే ఉద్దేశ్యంతో.

డైరీ తీశాను. అప్పుడు నాలో కలిగిన భావాల్ని వ్రాయాలని.

కిటికీ సందులగుండా వీస్తున్న గాలికి డైరీలోని పేజీలు తిరగబడ్డాయి. ఒక చోట ఆపి చూశాను. ఆ పేజీలో ఒక మైనస్ గుర్తు, ఒక ప్లస్ గుర్తు వున్నాయి. అయితే గుర్తు కొంచెం బండగా పెట్టి వుంది. ఆ సంకేతాల్లోని రూపం కళ్లెదుట నిలబడింది విస్పష్టంగా.

* *** *

విసిరేసినట్లు వూరుకి దూరంగా చిన్న రైల్వే స్టేషన్. రాత్రి పదిదాటింతరువాత ఎప్పుడో రావల్సిన పాసింజరు బండి ఆ స్టేషనులో ఆగింది. అందులోంచి దిగిన ఏకైక ఏకాకిని నేనే. పెద్ద సామానులేకపోయినా ఉన్న ఒక్క బ్రీఫ్‌కేస్ చేత్తో పట్టుకుని సుమారుగా నాలుగు కిలోమీటర్లు దూరంలో ఉన్న వూరు ఆ రాత్రి వెళ్లటం కుదరని పని. అప్పటికే తలుపులు మూసి ఫర్లాంగు దూరంలో వున్న తన క్వార్టర్సుకు బైలుదేరుతున్నాడు స్టేషను మాస్టారు. ఆయన్ని బతిమాలి ఆ రూములో పడుకోవటానికి పర్మిషన్ సంపాదించుకున్నాను.

సన్నగా తుంపర ప్రారంభమయింది. తలుపులు వేసుకుని చేతుల్లేని రెండు కుర్చీలు దగ్గరగా లాక్కుని ముడుచుకుని పడుకున్నాను. వుండుండి వస్తున్న మెరుపుల వెలుతురు తప్పించి వెలుగులేదు. సిగరెట్టు వెలిగించాను. ఎదురుగా కిరసనాయిలు దీపం కనబడింది. దాన్ని వెలిగించాను. వెలుతురు తోపాటు ధైర్యం కూడా కొంచెం నాకు తోడువచ్చాయి.

వాన పొజిషను చూద్దామని తలుపు ఓరగా తీశాను. ఫెడీమని కొట్టినట్టుగా లోపలి కొచ్చిన గాలితోపాటు ఓ ఆడమనిషి లోపలికొచ్చింది. మసక వెల్తుర్లో కళ్లు చికిలించి చూశాను. ఆకారం ఆహార్యం బిచ్చగత్తెను పరిచయం చేశాయి. ఆ పరిచయాన్ని పురస్కరించుకుని ఎందుకొచ్చావన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాను. ఎదపొంగుల్ని వయసు వంకరల్ని దాచలేని చింపి చెంగును చెవులమీదికి లాక్కుంటూ వానగాలి బాబూ..మరేం చెయ్యమంటారు.. అయినా ఆ మాత్రం తెలియదా అన్నట్లు చిట్లిన పెదాలమీదికి చిరునవ్వుజార్చింది. వాన వెలిసిన తరువాత చెట్ల ఆకులమంచి రాలిపడుతున్న నీటి బింధువుల్లో గాలి తాకిడి నుండి తప్పుకోవటాని కోసం తలుపులు బిగించాను గడియవేసి. ఆమె ఓ మూల వొదిగి కూర్చుంది. నేను వెళ్లి పొమ్మని చెప్పనందుకు కలిగిన సంతోషంలోని వెచ్చదనాన్ని కప్పుకుంటూ. మినుకు మినుకుమంటున్న దీపాన్ని ఎగసన దోశాను. వెలుగు మాత్రం పెరగలేదు మసిబారిన గ్లాసు మూలంగా.

"రాత్రి ఎంతవుద్దిబాబు" అంది ..లోపలి నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పావురాయి గూటిలోంచి మసకుమసకుంటున్న పావురాయిలా.. కనబడక పోయినా ఒకసారి వాచి వంక చూసుకుని పదకొండు అన్నాను. ఆ రెండు కుర్చీల మీద పరుచుకున్న దుప్పటి మీద ముడుచుకు పడుకుని ఆపైన రగ్గు కప్పుకున్నా ఆగని నాలోని చలిని అంత చలిలోను హాయిగా ముణగదీసుకుని మూలను వెచ్చదనాన్ని అనుభవిస్తున్న ఆమెను బేరీజు వేసుకుంటూ పర్సుపైకి తీసి, భద్రత కోసం తడిమి చూసుకుంటూ తిరిగి జేబులో పెట్టుకోబోయాను. అప్పుడే ఆమె వాన తగ్గిందేమో చూడటానికన్నట్లు తలుపు తీయబోయింది. లేచి "తలుపు తియ్యకు గాలి విసిరి కొడ్తుంది" అన్నాను. ఆమె తలుపు తియ్యకుండానే "గాలీ వాన తగ్గినట్లు లేదు బాబు" అంది యధాస్థానంలో కూర్చుంటూ "హమ్మయ్య"అనుకున్నాను.

కాలం అనేది కళ్లెంలేని గుర్రం, దాని రౌతు మనస్సుకు మతిలేదు. గాలి సందుల గుండా వీస్తూ కోసేస్తోంది. రగ్గు మరింత గట్టిగా కప్పుకున్నాను. చలికాలం బాబయ్యాఅంది తన వంటి వంక చూసుకుంటూ "అవునన్న'ట్టుగా ఆమె చూపుల్లో చూపులు కలిపి ఆమె శరీరాన్ని స్పృశించాను. పూర్తిగా కప్పలేని ఆ గుడ్డల మధ్య నగ్నత్వం ఉద్విగ్నంగా వుంది. పూర్తిగా ముసగదీసుకుని కూర్చుంది. ఒకే పద్ధతిలో కూర్చుంటే శరీరపు మడతల్లోంచి వేడి పుడుతుంది. ఆ వేడి శరీరాన్నంతటికీ రక్ష. మళ్లీ మడత సడలితే చలిగాలులు పెచ్చురేగిపోతాయి. తిరిగివేడి రగిలేదాకా.. నాకు నిద్ర దూరమైంది. లైటుంటే నాకు నిద్రపట్టదు బైటకవేశాను. ఇప్పుడు వెలుగులేకపోయినా ఫరవాలేదన్న ధైర్యంతో "తీసేయ్యనా బాబూ" అంది లేచి విలబడుతూ ఆ క్షణంలో నా చూపులు నగ్న. పరీక్ష చేశాయి. అది గ్రహించినట్లు నవ్వింది.. చిన్నగా చేతి గాజులు చిట్లినట్లు..

"ఏ వూరు మీది"

"మాకో వూరేంటి బాబూ" అంది కుండ బద్దలు కొట్టినట్లుగా. అందులో ఈ మాత్రం తెలియదా అన్న భావం రంగరించి. దాంతో మాటలు కరువైపోయినాయి. అందువల్ల తరువాతి మాటల కోసం వెతుక్కోవలసి వచ్చింది. కళ్లు మాత్రం వాటిపని మానలేదు.

"శరీరానికి కావల్సింది సుఖం. అందుకే జీవుని వేదన" అని అనుకుంటూ డైరీ తీశాను. ఆమె వెంటనే నన్ను ఫోటో తీత్తారా అంది. నాకు నవ్వు వచ్చింది. తియ్యనులే అన్నాను. డైరీలో గుర్తు పెట్టబోయి కొట్టేశాను.

మీకు నిద్రపట్టదు. వెలుగుంటే అంటూ లైటు తీసేసింది.

తిరిగి కూర్చుంటూ... మాకేం పరవాలేదు బాబూ మాయి బండ బతుకులు అంది ఒకటి ప్లస్ ఒకటి.

రెక్కలు కొట్టుకుంటూ... శకుంత పంతానాలు చేసే కలకలారావంతో మెళుకువ వచ్చింది. రాత్రి గాలి దూసుకువచ్చిన సందుల గుండా ఇప్పుడు అర్కుడు కిరణాలు సూటిగా పంపుతున్నాడు. తలుపులు వోరగావేసి ఉన్నాయి. గదంతా కలియజూశాను. చిరునవ్వు పెదవుల మీద వెల్లివిరిసింది. మీసాల మీద తేనెల్లా.. ఒకరాత్రి నా ప్రమేయంలేకుండానే గడిచిపోయిందిగా.

డైరీ తీసి గుర్తు పెట్టాను

ఆనాటి తదుపరి కార్యక్రమానికి ఉపక్రమించాను.

* *** *

ఈ విధంగా రూపాలు కళ్లకి కట్టినట్లు కనబడిపోతున్నాయి. ఆనాటి తారీకు పేజీ తీశాను గుర్తుపెట్టాలి.. "ఎల్లా" అని ఆలోచిస్తూ.

డాక్టరుగా నా జీవితంలో ప్రతి చిన్న విషయానికీ ఓ ప్రత్యేకత నిచ్చాను. ఒక విశేషం కల్పించాను. వైద్యుడిగా నా దగ్గరకు చాలమంది వస్తూపోతూ ఉంటారు. నా అనుభవాలు కొందరికి గురి. ఆ గురిలోని వేడి.. నా అనుభూతి.

ఒక వయస్సుకు ఆవేశమేగాని ఆలోచన వుండదు. పరిమాణమేగాని పరిణామం పట్టదు.

ఆమె నా దగ్గరకు వచ్చే రెగ్యులర్ రోగుల్లో ఒకరు. ఆమెను పరీక్షించడంలో నా 'ఎక్స్‌పీరియన్స్' అహం మీద దెబ్బ కొట్టింది. ఇంతవరకూ జయమేకాని పరాజయాన్నెరుగని నా "చేతం" జల్లుమంది. ఎన్నాళ్ళు ప్రయత్నించినా అంతు చిక్కలేదు. బాగా కలిగిన ఇంటి పడుచు అందంలో అందలం ఎక్కింది. రోగలక్షణాల్లో తృప్తిలేని తనం మొదటిది ప్రధానమైంది తీరిక అధికం రెండవది, ముఖ్యమైంది అందరూ వెళ్లినతరువాతగాని ఆమెతో మాట్లాడే అవకాశం ఉండేదికాదు. ఎందుకో? ఈ వ్యాధిని నిదానంగా పరీక్షించాలి. కొన్ని నా ప్రయత్నాలు విఫలమైనాయి. విఫలమైన కొద్దీ పట్టుదల అధికమైంది.

ఓడిపోతానేమోనన్న అప్పుడప్పుడూ కలిగే భయాన్ని ఓ(దు)రూహ మెదిలి అణిచివేసేది. రోజూ కొద్దికాలం ఆమెతో గడపడం.. చికిత్సలోని ప్రథమ విచికిత్స ఆమె మందుకు వస్తుంది. వెడుతుంది. నా ప్రయత్నం మాత్రం ఫలోన్ముఖం కావడంలేదు. అహం అసహనం అయింది. ప్రయత్నం తీవ్రతరమైంది. ఆమె ముందుకు వచ్చింది. నాలోని ఊహ ముందుకు వచ్చింది. వైద్యం ప్రారంభించాను. మృదువైన మాటల పఠనంతో విఫలమౌతున్న నా ప్రయత్నం బుసలుకొట్టింది. ఎప్పటికప్పుడు నాలో కలిగే భయాల్ని అణిచివేసే ఊహ పడగవిప్పింది. చిరునవ్వు లాస్యం చేసింది పెదవులమీద దర్పాల మీద వుంచబడిన అమృతభాండం నుండి చిలికిన ఒకటి రెండు అమృత బిందువుల్లా.. గ్లాసులో మందుకలిపిచ్చాను.. తాగమని..

తాగింది.

నిశ్శబ్దం కొన్ని గంటల్ని గుటకవేసింది. ఆమె లేచింది. లేస్తూ అస్తవ్యస్తంగా పడివున్న తన వంక అయోమయంగాను చెరిగిన జుట్టును సుతారంగా సవరించుకుంటున్న నావంక బెరుకుగా చూసింది. భయంతో కదిలిపోయింది. పులి పంజాలో చిక్కుకున్న లేడిలా జయంపొందిన చికిత్సా భావంలోని చివరి హాసం 'నర్సుని' పిలవడంతో లీనమైపోయింది.

నర్సుని తోడిచ్చి ఆమెను ఇంటికి పంపాను నా కారులో. డైరీ తీశాను. గుర్తు బండగా పెట్టుకున్నాను. ఆ పేజీలో చుట్టూ సున్నా చుట్టాను. (డైరీలో పేజీలకు వరస సంఖ్యలు నేవేసుకున్నాను.. ఎందుకోమరి).

గాలికి పేజీలు కదిలిపోయాయి.

* *** *

కళ్లు పొడుచుకున్నా గాఢాంధకారం తప్ప కనబడటం లేదు. గాలి తుఫాను రేకెత్తినట్లువీస్తోంది. సెలయేరు పడిలేస్తుంది భయంకరంగా. ప్రకృతిలోని ప్రతి వస్తువూ మరో వస్తువుతో ఘర్షణ పడుతోంది.

గతం పాఠం చెప్తుంటే, భావికి నిచ్చెనలువేసి, వర్తమానానికి వంకరలు దిద్దుతున్నాయి ప్రతి కదలిక అడుగునా కదిలే ఆలోచనలు.

నరాల సత్తువ, కరాల బిగువు మనోజవానికి లొంగిపోయాయి. ప్రకృతి విలయతాండవం చేస్తోంది.

ఇదో పరిభ్రమణం. ఇదీ అంతం.

ఈ ఆద్యంతాలు... అనంతం.